ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 : కనిష్ఠం 19.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 31 జనవరి 2025

బరంపూర్ పాఠశాల ఉపాధ్యాయుడి సస్పెన్షన్

తలమడుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బరంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మహేందర్ యాదవ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూషను నాలుగు రోజుల క్రితం దూషించాడు. ఆమె డయల్ 100కు ఫోన్‌చేయగా పోలీసులుస్టేషన్‌కు తరలించారు. ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేశారు. దీంతో ఉన్నత అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి ఉపాధ్యాయుడు మహేందర్‌ను గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

నాగోబా దర్బార్‌కు 79 ఏళ్లు


నాగోబా జాతరలో భక్త జన సందోహం

- నేడు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ప్రజా దర్బార్‌పై ప్రభావం
- ఏజెన్సీ సమస్యలపై ఆదివాసీల నిరంతర పోరాటాలు
- గిరి వికాసం పథకాన్ని వెంటాడుతున్న నిధుల కటకట
- విద్య, వైద్యం, రవాణా తాగునీటి సౌకర్యాలు కరువు
- కొందరికే దక్కిన పోడు భూముల హక్కు పత్రాలు

ఆదిలాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద జాతరగా పేరొందిన కేస్లాపూర్ నాగోబా జాతరలో 79 ఏళ్లుగా ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు. మొదటి సారి 1946లో కేస్లాపూర్ నాగోబా జాతరను సందర్శించిన మానవ పరిణామా శాస్త్రవేత్త హైమాండ్ డార్ఫ్ సూచనల మేరకు అప్పటి నిజాం ప్రభుత్వం గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా గిరిదర్బార్‌ను ప్రారంభించింది. అమాయక ఆదివాసీ గిరిజనుల వద్దకే అధికారులు, ప్రజా ప్రతినిధులు వెళ్లి తక్షణమే వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీంతో ప్రతీయేటా నాగోబా జాతర సందర్భంగా గిరిదర్బార్‌ను నిర్వహిస్తూ ఆదివాసీ గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దర్బార్‌కు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 9 తెగలకు చెందిన ఆదివాసీ గిరిజనులు ఈ దర్బార్‌కు హాజరై తమ సమస్యలు, ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. అయినా ఆశించిన ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు హామీలతోనే సరిపెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అక్కడికక్కడే ఏ ఒక్క సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవంటున్నారు. గడిచిన నాలుగేళ్లలో దర్బార్‌కు 1140 దరఖాస్తులు వచ్చినా ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులకు పరిష్కారం చూపారో ఐటీడీఏ అధికారులు స్పష్టంగా చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. యేటా దర్బార్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుని దరఖాస్తులు చేసుకుంటున్న ఆదివాసీలకు నిరాశనే మిగులుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమగోడును పట్టించుకోవడం లేదని ఆదివాసీలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

ఇప్పటికీ ఎన్నో ఏజెన్సీ మారుమూల గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం లేదు. వాగులు, వంకలు, ఒర్రెలు దాటుతూ ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లోనైతే దేవుడుపై భారం వేసి కాలం వెల్లదీస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సమయానికి వైద్యం అందక ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఉన్నత విద్య అవకాశాలు అందకపోవడంతో చాలా మంది విద్యార్థులు టెన్త్, ఇంటర్ విద్యకే పరిమితమవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఉట్నూర్‌కు గిరిజన యూనివర్సిటీని మంజూరు చేయాలని డిమాండ్ వినిపిస్తున్నా ప్రభుత్వాలకు పట్టింపు లేకుండా పోతోంది. గతంలో ఉట్నూర్‌కు వచ్చినట్లే వచ్చిన గిరిజన యూనివర్సిటీ చేజారి పోయింది. దీంతో ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్థోమత లేక ఇంటికే పరిమితమవుతున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ఇప్పటికీ ఎన్నో ఆదివాసీల గ్రామాల దరికి చేరడం లేదు. దీంతో స్థానికంగా ఉన్న వ్యవసాయ బావులు, చేతి పంపుల నీటినే తాగుతూ జీవనం గడుపుతున్నారు. గిరిజనుల సంక్షేమం కోసం పని చేసే ఐటీడీఏ పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడంతో ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అటకెక్కిన గిరి వికాసం

బీడు భూములకు సాగు నీటిని అందించి సస్యశ్యామలం చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో గిరి వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 10,496 మంది గిరిజన రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో నుంచి 4,785 మంది రైతులు అర్హులుగా గుర్తించారు. ఇప్పటి వరకు 970 మంది రైతులకు బోరుబావులను మంజూరు చేశారు. ఇందులో 554మంది రైతుల భూముల్లో బోరు బావులను తవ్వించారు. 445 బోరు మోటార్లకు విద్యుత్ కనెక్షన్లను అందించి 347 పంపు మోటార్లను బిగించినట్లు అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. గత ఏడాది కాలంగా నిధులు లేక పోవడంతో గిరి వికాసం పథకం పూర్తిగా నిలిచిపోతోంది. అలాగే చాలా గ్రామాల్లో ఫారెస్టు అనుమతులు లేక పోవడంతో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇలా గిరి వికాసం పథకానికి అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. గిరి వికాసం పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తే గిరిజన గ్రామాల్లో సిరులను పండించే అవకాశం ఉందంటున్నారు.

అరకొరగానే హక్కు పత్రాలు

ఎన్నో ఏళ్లుగా అడవి భూములను సాగు చేస్తూ వస్తున్న గిరిజనులకు గత ప్రభుత్వ హయాంలో అరకొరగానే హక్కు పత్రాలు అందాయి. ఎకరాల్లో సాగు చేస్తున్న భూములకు గుంటల్లోనే హక్కు పత్రాలను ఇచ్చారు. దీంతో పోడు భూముల సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం దక్కలేదు. జిల్లా వ్యాప్తంగా 12,222 మంది రైతులకు గాను 31,683 ఎకరాల భూమికి హక్కు పత్రాలను అందజేశారు. అయితే గతంలో గిరిజనేతరుల నుంచి కూడా ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. కానీ ఏ ఒక్కరికి అటవీ భూములపై హక్కు పత్రాలను ఇవ్వలేదు. ఇంకా పోడు భూముల హక్కు పత్రాల కోసం ఆదివాసీ గిరిజనుల రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతునే ఉన్నారు. ప్రతీయేటా అటవీ శాఖ అధికారులతో సమస్యలు, వివాదాలు ఎదురవుతునే ఉన్నాయి. ఇకనైనా పోడు భూములకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇంకా ఎందరో మంది రైతులు హక్కు పత్రాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అర్హులైన వారికి వెంటనే హక్కు పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు సెలవు

నాగోబా జాతర సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవు దినంగా ప్రకటించారు. ప్రతీయేటా దర్బార్‌ను నిర్వహించే రోజు సెలవును ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు నాగోబా దర్బార్‌కు తరలివెళ్లనున్నారు. నాగోబా జాతరను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు అన్ని రకాల పాఠశాలలకు సెలవులను ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ప్రజా ప్రతినిధుల హాజరు అనుమానమే

నాగోబా జాతర సందర్భంగా శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్‌కు ప్రజా ప్రతినిధులు హాజరు కావడం అనుమానమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఎమ్మెల్సీ ఎన్నికల నియామవళి గురువారం నుంచే అమలులోకి రావడంతో అధికారికంగా నిర్వహించే ప్రజాదర్బార్‌కు మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు హాజరయ్యే అవకాశం ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రులు సీతక్కతో పాటు కొండా సురేఖ, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్‌జాదవ్, పాయల శంకర్, కోవ లక్ష్మి ఇతర ప్రజా ప్రతినిధుల హాజరయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. నేరుగా ఆలయానికి వచ్చి నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. దీంతో గిరిజనుల సమస్యల పరిష్కారానికి నిర్వహించే గిరిదర్బార్‌పై కొంత ప్రభావం పడే అవకాశం ఉందంటున్నారు.


నాగోబా జాతరకు తరలివస్తున్న ఆదివాసీలు


జాతరకు హాజరైన ..

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి


జైనథ్‌లో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటలను విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. గురువారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కొనుగోలు చేసిన తొలి రైతును సత్కరించి తూకం వేశారు. ఆమె మాట్లాడుతూ కందులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,550 ఇస్తుందన్నారు. రైతులు ప్రైవేట్ వ్యాపారాలు, దళారులను నమ్మి మోస పోకుండా కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీ ణ్‌రెడ్డి, డీసీవో మోహన్‌రావు, డీఏఓ శ్రీధర్ స్వామి, మార్కెటింగ్ ఏడీ గజానంద్, మార్కెట్‌కార్యదర్శి మధుకర్, కేంద్రం ఇన్‌చార్జి పండరి పాల్గొన్నారు.

జైనథ్ సివిల్ సప్లై గోదాం తనిఖీ

జైనథ్ : మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ గోదాంను గురువారం ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం నిల్వలను గోదాం పరిసరాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. దీంతో పాటు వ్యర్థ బియ్యాన్ని వేలం వేయాలని సూచించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబర్

- విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్


విద్యుత్ శాఖ ఎస్ఈ

ఆదిలాబాద్, జనవరి30 (ఆంధ్రజ్యోతి) :అన్ని రకాల విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహన్ తెలిపారు. ఏదైనా సమస్య వస్తే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. 24గంటల పాటు వినియోగదారులకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ పై 1912 టోల్ ఫ్రీ నెంబర్‌ను గుర్తించడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో తలెత్తె సమస్యలు ట్రాన్స్‌ఫార్మర్లు ఫేల్యూర్, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ లోవోల్టేజి, బ్రేక్‌డౌన్స్, ప్రమాదకరంగా ఉన్న స్తంబాలు, విద్యుత్ తీగల గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే విద్యుత్ బిల్లుల్లో పేరు మార్పు, బిల్లులో తేడాలు ఏమైనా హెచ్చుతగ్గులు ఉన్న విద్యుత్ మీటర్లలో సమస్యలు, ఆగి పోయిన, కాలిపోయిన నూతన సర్వీసులను పొందేందుకు ఈ టోల్‌ఫ్రీ సేవలను పొందవచ్చని తెలిపారు.

ఒత్తిడి తగ్గించాలని ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ విధులు నిర్వహిస్తున్న సాయిచరణ్ అధికారుల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడని టీజీవో సంఘం అధ్యక్షులు శివకుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్స్ సంఘం అధ్యక్షులు ప్రవీణ్ ఆరోపించారు. సాయిచరణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఉద్యోగులపై ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆదిలాబాద్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మిస్సైల్ మ్యాన్‌అబ్దుల్ కలాం ఆలోచనలను గుర్తుచేసుకుంటు విద్యార్థులు కూడా దేశానికి ఉపయోగపడేలా ప్రయోగాలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ అండ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో డిఫెన్స్ అండ్ స్పెస్‌ఎక్స్‌పోను గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్లో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఎక్స్‌పోను ప్రారంభించారు. అంతకుముందు కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచి సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని బావి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి సాంకేతిక ప్రదర్శన, అవగాహన ఉపయోగపడుతుందన్నారు. ఆలోచన శక్తి పెరగాలంటే దేశం కోసం సేవలు చేసిన మహనీయుల గురించి తెలుసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచదేశాలకు నాయకత్వం వహించేలా దేశం ఎదుగుతుందన్నారు. ప్రయోగాలను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ కింద రూ.10 వేల కూడా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ వ్యవ స్థాపకులు నరేష్, పాఠశాల ప్రిన్సిపల్ దేవేందర్ పటస్కార్, బ్రాహ్మ జిల్లా అధ్యక్షులు రంగినేని పవన్ రావు, సభ్యులు పురుషోత్తం రెడ్డి, వేదవ్యాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు : డీఈవో ప్రణీత

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఈఓ ప్రణీత అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రెండురోజుల జిల్లాస్థాయి కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం డైట్ నిర్వహించిన ఈ శిక్షణ తొలి రోజు కార్యక్రమంలో డీఈఓ పాల్గొని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. డైట్‌వైస్ ప్రిన్సిపాల్ కోలకిరణ్‌కుమార్ విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడంతోపాటు ఆత్మస్థైర్యం ఏ విధంగా పెంచాలో వివరించారు. ప్రతి ఏటా పదోతరగతి విద్యార్థులు పరీక్షలకు ముందు తర్వాత ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు వాటిని తగ్గించాలనే లక్ష్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో ముందస్తుగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని డీఈఓ ప్రణీత తెలిపారు. భవిష్యత్తు లక్ష్యాలను ఏ విధంగా సాధించాలో వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు మెన్నె ఎలియా, ప్రమోద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త మండలాల వారీగానే స్థానిక సంస్థల ఎన్నికలు

- పెరిగిన ఎంపీటీసీ స్థానాలు
- 3న ఫైనల్ నోటిఫికేషన్ విడుదల

ఆదిలాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొత్తగా ఏర్పడిన మండలాల వారీగానే త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఉన్న 18 మండలాలకు గాను మరో 3 మండలాలు కొత్తగా ఏర్పడడంతో జిల్లా మండలాల సంఖ్య 21కి చేరింది. జైనథ్ మండలంలో బోరజ్, సాత్నాల, బోథ్ మండలంలో సోనాలను కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. 3500ల జనాభాకు ఒక్కో ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేశారు. దీంతో జిల్లాలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య పెరిగింది. కొత్తగా ఏర్పడిన ఎంపీటీసీ స్థానాలపై ఫిబ్రవరి 2 వరకు అభ్యంతరాలను స్వీకరించి ఫిబ్రవరి 3న ఫైనల్ నోటిఫికేషన్‌ను వెల్లడిస్తామని జడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి తెలిపారు. దీని ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తారు. ఇప్పటికే కొత్త మండలాలకు ఎంపీడీఓలను కేటాయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో మండల కార్యాలయాల ప్రారంభం వాయిదా పడింది.

మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాల మార్పులు, చేర్పులు ఇలా..

మండలం	ఎంపీటీసీ స్థానాలు	గ్రామ పంచాయతీలు	జనాభా(2011 ప్రకారం)
బోరజ్	05	17	17909
సాత్నాల	05	17	13662
సోనాల	05	12	13025
ఆదిలాబాద్	10రూరల్	31	34514
బేల	09	31	32661
బోథ్	10	21	35191
జైనథ్	07	17	23788
మావల	05	03	6310
ఉట్నూర్	18	38	63465

కుష్ఠు వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే చికిత్సలకు అనువుగా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన అన్నారు. జాతీయ కుష్ఠు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఖుర్షిద్ నగర్ అర్బన్ పీహెచ్‌సీలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుష్ఠు రహిత సమాజం కోసం ఆశా, ఏఎన్‌ఎంలు కృషిచేయాలన్నారు. గతంలో కేసులు పెరిగిన నేపథ్యంలో ముందస్తుగా కుష్ఠు గుర్తింపునకు కృషి చేసి త్వరగా నయం చేసేలా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీబీ అధికారి సుమలత, అండ్ లెప్రసీ అధికారి గజానంద్, డీఐఓవైసీ శ్రీనివాస్, వైద్యాధికారి అన్సారీ, డీపీఎంవోలు వామన్‌రావ్, రమేష్, ఎల్పీ నిజా మోదీ ్దన్, సీవో ప్రశాంత్ దేశ్‌పాండే, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరడిగొండ : కుష్ఠువ్యాధి నివారణ కోసం వైద్యశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు వాంకిడిలో అవగాహన కల్పించారు.

డీఎంఈని కలిసిన రిమ్స్ డైరెక్టర్


డీఎంఈను సన్మానిస్తున్న రిమ్స్‌డైరెక్టర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)డాక్టర్ నరేందర్ కుమార్‌ను గురువారం హైదరాబాద్‌లో ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం రిమ్స్ అభివృద్ధిపై వారితో సమీక్షించారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ, వైద్యసేవలు, పలు విషయాలపై చర్చించినట్లు డైరెక్టర్ జైసింగ్ పేర్కొన్నారు.

హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

● బీఆర్ఎస్ నాయకుల నిరసన
● గాంధీ విగ్రహాలకు వినతి

నేరడిగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓ మహాత్మా ఈ దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వానికి దారి చూపించు అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ గురువారం నేరడిగొండ మండల కేంద్రంలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి 420 హామీలు నెరవేర్చాలని మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీఎంపీపీ రాథోడ్‌సజన్, మాజీ సర్పంచ్ వెంకట రమణ, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టేకిరణ్, పాల్గొన్నారు.

గుడిహత్నూర్ : ఇచ్చిన హామీలను నెరవేర్చ డంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దని గురువారం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్ర మం లో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ తిరుమల్‌గౌడ్, మాజీ సర్పంచ్ పవార్, రవినాయక్, నాయకులు జాదవ్, భీంరావు, దోమకొండ, సుధాకర్, నక్క భూమన్న, మాధవ్ పాల్గొన్నారు.

సిరికొండ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులు గడుస్తున్నా... ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మరిచిపోయిందని బీఆర్ఎస్ మండల నాయకులు ఒరగంటి పెంటన్న అన్నారు. గురువారం సిరికొండ మండల కేంద్రంలో స్థానిక గాంధీ చౌక్ వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న ఆధ్వర్యంలో గాంధీ విగ్రహనికి వినతి పత్రం అందించి, రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.


గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే

ఉట్నూర్ : కాంగ్రెస్ సర్కారుకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ గాంధీ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు సమర్పించారు. గాంధీవర్ధంతి పురస్కరించుకొని టీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు చిత్రపటానికి వినతిపత్రం ఇచ్చామని మాజీ వైస్ ఎంపీపీ సలీముద్దీన్, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, మాజీ ఎంపీటీసీ కాటం రమేష్‌లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్రే రమేష్, దావుల రమేష్, సత్తన్న, ఖదీర్, భూమన్న, రాథోడ్ అన్వేష్ ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : సీఎం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అజయ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 420 రోజులవుతున్నా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు వినతి పత్రం సమర్పించారు.

నార్నూర్ : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు చంద్రశేఖర్ లోకండే అన్నారు.

కన్నుల పండువగా నాగోబా జాతర

ఇంద్రవెల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాగోబా జాతర మూడోరోజు గురువారం భక్తులు తండోప తండాలుగా తరలివచ్చారు. రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులతో నాగోబా ప్రాంగణం పులకించిపోయింది. ఒకేచోట బస చేసిన మెస్రం వంశీయులు ఆత్మీయ పలకరింపులు, కుశల ప్రశ్నలతో ముచ్చట్లతో గడిపారు. గోవాడ వద్ద పూజలు నిర్వహించారు. ముందుగా గోవాడ్ వద్ద బస చేస్తున్న మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాల నడుమ నాగోబా ఆలయం వెనుక ఉన్న పెర్సాపేన్, బాన్‌పేన్‌ల దేవత ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. బేటింగ్ అయిన కొత్త కోడళ్లు కోనేరు నుంచి నీటిని తీసుకొచ్చారు. మెస్రం వంశం అల్లుళ్ల బాన్‌పేన్ దేవత ఆలయం ముందున్న పాత పుట్టలను తొలగించారు. శనివారం గోవాడ్ ముఖం ద్వారం వద్ద బేతాల్‌పూజ, మండగాజలింగ్ పూజలతో మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, మెస్రం చిన్ను పటేల్, కటోడ మెస్రం కోసేరావు, మెస్రం దేవ్‌రావు, మెస్రం దాదారావు, మెస్రం తిరుపతి, మెస్రం తుకారం, మెస్రం నాగనాథ్, మెస్రం శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు రెండవ అతిపెద్ద ఆదివాసీ గిరిజన నాగోబా జాతరలో ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం భక్తులకు తాగునీరు ఇతర కనీస వసతులు కలిఁచగా ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగే దర్బార్‌తో పాటు జాతర ఉత్సవాల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుదినం వర్తిస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. నాగోబా జాతర ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌తో కలిసి జాతర ఏర్పాట్లను గురువారం పరిశీలించారు.


కోనేరు వద్ద నీటిని సేకరిస్తున్న కొత్త కోడళ్లు


నాగోబాను దర్శించుకున్న జాయింట్ డైరెక్టర్

ఇంద్రవెల్లి : అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా దేవాలయంలో వరంగల్ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ జి. అనసూయ, ములుగు జిల్లా ఐసీడీఎస్ సీడీపీవో ధనలక్ష్మితో కలిసి నాగోబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, మెస్రం వంశీయులు జాయింట్ డైరెక్టర్‌ను శాలువాతో సత్కరించి నాగోబా చిత్రపటాన్ని బహుకరించారు. సాంప్రదాయ రీతిలో ఆదివాసీలు తమ ఆచారాన్ని కొనసాగిస్తూ భావితరాలకు అందించే దిశగా కృషి చేయాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ఉట్నూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని రాజన్నగూడకు చెందిన అనునూరి వెంకటి (48) దంతన్‌పల్లిలో గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాజన్నగూడెంకు చెందిన వెంకటి దంతనపల్లిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడాన్ని గుర్తించిన గ్రామస్థులు గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని సామాజిక మాధ్యమంలో తెలవడంతో ఉట్నూర్ పోలీసులు సంఘటన గురించి విచా రణ చేస్తున్నారు. సమాచారం సేకరిస్తున్నామని పోలీసులు వివరించారు.

సమస్యలపై గళమెత్తే నాయకులను ఎన్నుకోవాలి

● ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరం కోసం బీజేపీ అభ్యర్థులు ముందుంటారని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, అంజిరెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాలకవర్గానికి వంత పాడకుండా పార్టీ అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయులపై శాసనమండలిలో ప్రస్తావిసా్తరన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఉన్న బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏ హామీలను నెర వేర్చకుండా మోసగించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగె బ్రహ్మానంద్, నాయకులు లాలామున్న, రఘుపతి పాల్గొన్నారు.

మావల: పట్టభద్రులు ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తిన నాయకులు కావాలని, అందుకు సమస్యలను పాలకపక్షం దృష్టికి తీసుకెళ్లే నేతలను భాజపా గుర్తించి మద్దతు ఇవ్వడం జరిగిందని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు పేర్కొన్నారు. గురువారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పరిచయం చేసి మద్దతు ఇవ్వాలని కోరారు.

స్వరాజ్య స్థాపనకు కృషి చేయాలి

ఇంద్రవెల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ కలలు గన్న స్వరాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం పిలుపునిచ్చారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు స్వాతంత్ర కోసం మహాత్మా గాంధీ చేపట్టిన స్వాతంత్ర్య సంగ్రామం స్ఫూర్తిదాయకమన్నారు. అహింసా వాదమే గాంధీ ఆయుధమని, ఆయన చూపిన అహింసా మార్గంలోనే అందరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోయం మారుతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పడ్ వరుణ్ పటేల్, పట్టణ అధ్యక్షులు ఎండీ జహార్, డైరెక్టర్లు కొడప శ్రీకాంత్, సీడాం జంగు, చాకటి మానిక్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌అర్బన్ : గాంధీ చూపిన బాటలో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌లు అన్నారు. గురువారం ప్రజాసేవ భవన్ క్యాంపు ఆఫీస్‌లో గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఇందులో మునిగెలనర్సింగ్, దర్శనాల లక్ష్మణ్, ఎంఎ షకీల్, కొండూరి రవి, శంకరయ్య, నాగన్న, ఇజ్జగిరి సంజయ్‌కుమార్, మంచాల మల్లయ్య పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

నేరడిగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రక టించాలని లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ ఫిబ్రవరి 15న జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించకపోతే తెలంగాణ రాష్ట్రమే కాకుండా భారతదేశం మొత్తానికి బంజార జాతి ఎక్కువగా ఉందని గుర్తుచేశారు. లంబాడ జాతి ఏకమై ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి సెలవు దినంగా ప్రకటించాల్సి ఉందని మహేందర్ యాదవ్ అన్నారు. ఇకనైనా ప్రభుత్వం సేవాలాల్ జయంతిని సెలవు దినం గా ప్రకటించాలని లైప్ అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి పండునాయక్, మండల ఇన్ చార్జి సందీప్ నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీని వాస్, లంబాడ నాయకుడు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి30 (ఆంధ్రజ్యోతి):జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు, గంగపుత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీజేపీ నాయకులు మేకలఅశోక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది‌శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మేకల అశోక్‌కు పార్టీ కండువా కప్పి కంది‌శ్రీనివాస్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఏ ప్రభుత్వం చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని అందుకే పార్టీలో చేరినట్లు అశోక్ తెలిపారు.ఈ సందర్భంగా కంది‌శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ బీజేపీ నాయకులు తమ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందని, మున్ముందు ఇంకా భారీ ఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు ఉంటాయన్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురేయడమే లక్ష్యంగా కలిసి పని చేద్దామన్నారు. ఇందులో నాయకులు గిమ్మసంతోష్‌రావు, జహీర్‌రంజాని, బండారి సతీష్, ఆవులవెంకన్న, ఎంఎ షకీల్, దాసరి ఆశన్న, కొండూరి రవి, తమ్మలచందు, ఎంఎ కయ్యుం, క్యాతం శివప్రసాద్‌రెడ్డి, దర్శనాల చంటి, నలిమేల పోతారెడ్డి, సమీ ఉల్లాఖాన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

తరచూ ఊడిపోతున్న భగీరథ పైప్‌లైన్


ఊడిపోయిన పైప్‌లైన్ కనెక్షన్

బోథ్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొచ్చెర గ్రామం సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ జైంట్ల వద్ద తరచుగా విడిపోతుంది. గురువారం ఉదయం పూట పైప్‌లైన్ కనెక్షన్ల నుండి విడిపోవడంతో నీరు వృధాగా పోయింది. దీంతో విషయం భగీరథ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. అనంతరం అక్కడికి చేరుకున్న సిబ్బంది లీకేజీని నిలిపివేసి కనెక్షన్ ఊడిపోయిన చోట బిగించడం జరిగింది. దీంతో భగీరథ నీళ్లు గ్రామాలకు చేరాయి.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలి

తలమడుగు , జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని శ్రీ శ్రీ పరమహంస సద్గురు పులాజి బాబా తనయుడు వామన్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పులాజి బాబా ధ్యానకేంద్రంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ఆత్మజ్ఞానం సద స్సులో ఆయన మాట్లా డుతూ నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో మనిషికి మనశ్శాంతి లేకుండా ఉందన్నారు. దీనివల్ల వివిధ వ్యాధులతో సతమతమవుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పరమహంస సద్గు రువు శ్రీ పూలాజి బాబా చూపిన ధ్యాన మార్గంలో నడుచుకోవాలని కోరారు. పుట్టి పెరిగిన గ్రామాన్ని తల్లిదండ్రులను ఎప్పటికీ మర్చిపోవద్దు అన్నారు. అనంతరం సామూహిక ధ్యానం, అన్నదాన కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధ్యాన కమిటీ అధ్యక్షులు కాటిపెల్లి సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు నీలగిరి అశోక్, తుకారం మహారాజ్, ప్రైవేట్ కమిటీ సభ్యులు దేవరావు, సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ వెంకట్రావు, డిప్యూటీ తహ సీల్దార్ ప్రభాకర్, ఏపీవో మేఘమాల, సీనియర్ ఫార్మసిస్ట్ శైలజ, కమిటీసభ్యులు ఇంద్రమ్మ, రాధాబాయి, భోజమ్మ, అండే నారాయణ. కేశవ్ పాల్గొన్నారు.

మహాత్ముడు చూపిన బాటలో నడవాలి


మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ మహాత్మా గాంధీ చూసిన బాటలో ముందుకు సాగాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ అన్నారు. డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు ఆదేశాల మేరకు ఆయన నివాసంలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు అతిక్ హైమద్, కాంగ్రెస్ నాయకులు గాజుల రవికుమార్, సభా కలీం, దేవరకోట దేవస్థానం సభ్యులు సంతోష్, పట్టణ కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ అంబాజీ మాజీ దేవరకోట దేవస్థానం సభ్యులు నాంపెల్లి నర్సయ్య, మాజీ కౌన్సిలర్ సలీం, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యకాంత్ కాంబ్లీ, రవి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల, జనవరి, 30 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో ఆదిలాబాద్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన ఇట్టి కార్యక్రమంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్, యువ కేంద్రం సిబ్బంది మాజీద్, స్థానికులు బోగ గోవర్ధన్, వడ్నం రవి, పండరి, బోగ రాజేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మహాత్మాగాంధీకి నివాళులర్పించిన పోలీసులు



నిర్మల్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం రోజు మహాత్మాగాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలు స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముథోల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ కుమార్, ఏపీవో శిరీషరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

'ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సీసీ కెమెరాల ఏర్పాటును ఉప సంహరించుకోవాలి'

నిర్మల్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో గురువారం రోజు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. సాయిలు మాట్లాడుతూ... ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ప్రయోగశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు జిల్లా వ్యాప్తంగా థియరీ పరీక్షలకు కేంద్రాలను ఇవ్వబోమని తెలిపారు.

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలి

● బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో ఇళ్ల లేని పేదలు 1 లక్షల 90 వేల దరఖాస్తులు వస్తే నియోజకవర్గం నుంచి సుమారు 70 వేలకు పైగా దరఖాస్తులు వస్తే కేవలం 3,500ల ఇళ్లు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. అర్హులను ఎలా గుర్తిస్తారు. దానికి సంబంధించిన పూర్తి ప్రణాళికను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. రేషన్ కార్డు జారీలపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని మున్సిపల్‌లో తీర్మానం చేయించాం.



త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి పూర్తి నివేదిక సమర్పించి, మాస్టర్‌ప్లాన్ రద్దుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీలకు కొత్త రథసారథుల నియామకం

భైంసా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లాలోని ఏడు మండలాలు, నిర్మల్ మున్సిపాలిటీకు కొత్త రథసారథులను నియమించింది. ఈ మేరకు గురువారం బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , జిల్లా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిలు ఏడు మండలాలకు, నిర్మల్ మున్సిపాలిటీకు పార్టీ అధ్యక్షులతో పాటు ఆయా మండలాల పరిధి నుంచి జిల్లా కౌన్సిల్ సభ్యులను ప్రకటించారు. ముథోల్ నియోజక వర్గ బాసర మండల అధ్యక్షులుగా పుట్నాల సాయినాథ్, జిల్లా కౌన్సిల్ సభ్యునిగా బిద్దూర రమేష్, నిర్మల్ నియోజక వర్గం మామడ మండల అధ్యక్షునిగా రంజిత్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యునిగా బోయ నర్సయ్య, లక్ష్మణ్‌చాంద మండల అధ్యక్షునిగా గాండ్ల చిన్నయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యునిగా గుడ్ల రంజిత్, సారంగాపూర్ మండల అధ్యక్షునిగా కాల్వ నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యునిగా చౌహాన్ దిలిప్, దిలావర్‌పూర్ మండల అధ్యక్షునిగా అయిండ్ల నర్సారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యునిగా పిసరి శైలేశ్వర్, నర్సాపూర్ మండల అధ్యక్షునిగా బరుకుంట నరేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యునిగా ఎం.వినోద్ రెడ్డి, నిర్మల్ మున్సిపాలిటి - 1 అధ్యక్షునిగా ఆకుల కార్తీక్, , జిల్లా కౌన్సిల్ సభ్యునిగా అల్లం భాస్కర్ నిర్మల్ మున్సిపాలిటీ - 2 అధ్యక్షునిగా సుంకరి సాయి, జిల్లా కౌన్సిల్ సభ్యునిగా శ్రీరామోజీ నరేష్‌లు నియమింపబడ్డారు.

మామడ మండలం బీజేపీ పార్టీ అధ్యక్షుడిగా బి. రంజిత్ కుమార్



మామడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల బీజేపీ అధ్యక్షుడిగా బత్తుల రంజిత్‌కుమార్ (న్యాయవాది)ను గురువారం రోజున తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ బలో పేతానికి కృషి చేస్తానన్నారు. నన్ను నమ్మి పదవీ బాధ్యతలు పెట్టినందుకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుపోయే విధంగా పార్టీని బలోపేతం చేస్తానన్నారు.

మహాత్మా.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించు

● బీఆర్ఎస్ శ్రేణుల వినూత్న నిరసన ● మహాత్మాగాంధి విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పణ


భైంసాలో గాంధీ మహాత్ముడి విగ్రహానికి వినతిపత్రం అందజేసి నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రతినిధులు

భైంసా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలును విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించు మహాత్మ అంటూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి బీఆర్ఎస్ శ్రేణులు వినూత్న నిరసనలు చేపట్టాయి. గురువారం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు భైంసాలో బీఆర్ఎస్ శ్రేణులు పార్టీ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యురాలు పి.రమాదేవి నేతృత్వంలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రవేశమార్గంలో గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేసి హోరెత్తించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రదర్శనలు చేపట్టారు. పార్టీ ప్రతినిధులు నంగి రాజేష్, రావుల పోశెట్టి, నిమ్మ సురేష్, అజీజ్ ఖురేషీ, వాసే , కపిల్, హసడే సజన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని వినతి

నిర్మల్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీ పార్క్‌లోని గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ కొరిపెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కే. కృష్ణారెడ్డి, మహేష్ రెడ్డి, జాగృతి చారి, డాక్టర్ సుభాష్ రావు, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

ఖానాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి 420 రోజులైనా అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని బీఆర్ఎస్ ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు అన్నారు. గురువారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖానాపూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గౌరీకర్ రాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 420 హామీలతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు వాగ్దానం చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, ఖానాపూర్ మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్ పాల్గొన్నారు.

నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా జగదీశ్వర్‌గౌడ్



నిర్మల్ చైన్‌గేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పురపాలక సంఘం కమిషనర్‌గా జగదీశ్వర్‌గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జగిత్యాల జిల్లా రాయికల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఆయనను నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా మార్చాలి

నిర్మల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కుష్టువ్యాధి రహిత జిల్లాగా మార్చాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. పట్టణంలోని జిల్లా వైద్య, ఆరోగ్య కేంద్రంలో గురువారం రోజు లెప్రసీ స్పర్శ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ... జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరూ అంకిత భావంతో పని చేయాలని, కుష్టు వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే, వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని, అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చునని తెలిపారు. అనంతరం సిబ్బంది అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో నేడు పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్

ఖానాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో నేడు (శుక్రవారం)పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సీన్ ఇవ్వనున్నట్లు పశుసంవర్థక శాఖ ఖానాపూర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాంచందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఖానాపూర్‌లోని పశువుల ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాక్సీన్‌ను ఉచితంగా ఇవ్వనున్నందున కుక్కలను పెంచుకునే యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వాటికి రాబిస్ వ్యాక్సీన్‌ను ఇప్పించాలని ఆయన కోరారు.

పన్నులు వంద శాతం వసూలు చేయండి

లక్ష్మణచాంద, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 100 శాతం టాక్స్ వసూలు చేయాలని ఎంపీడీవో రాధా రాథోడ్ గురువారం ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నర్సరీలను సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్నందున సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ప్రమీల, ఎంపీవో రాధారాథోడ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

సోన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్దులకుంట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రార్థన సమయానికి హాజరై ఈ సందర్భంగా పాఠశాల పదవ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రతి సబ్జెక్టులో సిలబస్ పూర్తి అయిందో లేదో తెలుసుకుని 100 శాతం సిలబస్ పూర్తయిం దని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.హరీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి

కుంటాల, జనవరి, 30 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాల హైస్కూల్, లింబా (కే) హై స్కూల్, ఓలా తెలుగు, ఉర్దూమీడియం హైస్కూల్‌లలో పదవ తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు.


ఫొటో న్యూస్



నర్సాపూర్ వెళ్లే దారిలో రోడ్డుకు ఆనుకొని ఉన్న పొలంలో ఇలా..

విద్యుత్ స్తంభాల
నేల చూపులు!

- ప్రమాదకర విద్యుత్ స్తంభాలతో బెంబేలెత్తుతున్న రైతులు, ప్రజలు
- పంటపొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు



మేడిగూడ ఆశ్రమ పాఠశాల ఎదురుగా ఉన్న పొలంలో విద్యుత్ స్తంభం ఇలా..

ఇచ్చోడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రధాన ప్రాంతాలు, రోడ్డును ఆనుకుని ఉన్న పొలాలు, రహదారికి అడ్డంగా విద్యుత్ స్తంభాలు నేల చూపులు చూస్తున్నాయి. భూమికి ఆనుకు నేలా ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. చుట్టుపక్కల ప్రజలు పనుల నిమిత్తం తిరుగుతున్నప్పుడు ఏమాత్రం తీగలు తగిలినా ప్రాణాలకే ప్రమాదం. నిత్యం అధికారులు రోడ్డు మీద వెళ్తుంటే ఈ దృశ్యం కనిపిస్తూనే ఉంటుంది. కానీ స్పందించడం లేదని అటు రైతులు, ఇటు ప్రజలు వాపోతున్నారు. ప్రమాదాలు జరగకముందే స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

ఆధ్యాత్మిక చింతనలో చించాల

» హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్తాహ » ప్రతీ ఏడాది ఏడు రోజుల పాటు కార్యక్రమం » చించాల గ్రామంలో గత 25 ఏళ్లుగా సప్తాహ

» భక్తిభావంతో వెల్లివిరుస్తున్న గ్రామం » నేటికి ఆరో రోజుకు చేరిన సప్తాహ » రేపటితో ముగియనున్న కీర్తనలు

భక్తి



భక్తి కీర్తనల్లో భక్తులు



భజన చేస్తున్న భక్తులు



వేకువ జామున కాకడ హారతిలో పాల్గొన్న భక్తులు

ముథోల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనలో చించాల గ్రామం విరాజిల్లుతోంది. గ్రామస్థులంతా ఐక్యంగా తలా కొంత డబ్బును పోగు చేసి స్థానిక హనుమాన్ ఆలయంలో ఏడు రోజులపాటు అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమంలో ప్రతీ సంవత్సరం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాదితో ఈ అఖండ హరినామ సప్తాహ 25 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. గత 25 ఏళ్ల నుంచి శ్రీ నారాయణ మహారాజ్ యాతల్‌కర్ నేతృత్వంలో గ్రామస్థులు భక్తిమార్గం వైపు నడుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

25 ఏళ్లుగా సాగుతున్న ఈ భక్తి కార్యక్రమం

నిర్మల్ జిల్లా ముథోల్ మండలం చించాల గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రతీ ఏడాది ఏడు రోజులపాటు అఖండ హరినామ సప్తాహ నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏడాది జనవరి 25న ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహ ఫిబ్రవరి 1 తేదీ వరకు నిర్వహించనున్నారు. 2001లో స్థానిక హనుమాన్ ఆలయంలో ఈ భక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సప్తాహ ప్రారంభమైన రోజు నుంచి సప్తాహ ముగిసే వరకూ వీణ, తాళాలు వాయిస్తూనే ఉంటారు. గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి వంతుల వారీగా 7 రోజులపాటు పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రతీరోజు ఉదయం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహిస్తారు. అలాగే ఏడు రోజులపాటు రోజూ భజన, భక్తులకు అల్పాహారం, భోజన సౌకర్యం కల్పిస్తారు. ప్రతీరోజు వేకువ జామున కాకడ హారతి, రాత్రివేళలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహారాజ్‌లతో కీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం భజన దిండులతో పాల్గొని తెలుగు, మరాఠీ భాషల్లో కీర్తనలు చేస్తారు. గ్రామస్థులంతా ఐక్యంగా ఉంటూ ఈ కార్యక్రమానికి సుమారు రూ.3లక్షలకు వెచ్చించి భక్తి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఏడు రోజులపాటు గ్రామస్థులు అంతా భక్తులు, చుట్టాలతో పండుగ వాతావరణం సంతరించుకుంటోంది. సప్తాహకు వచ్చిన భజన సభ్యులకు, మహారాజులకు సన్మానాలు చేస్తారు. ఈసప్తాహ రోజుల్లో అన్నదానం నిర్వహించేందుకు పోటీ పడుతారు. ప్రతీరోజు సుమారు 2 క్వింటాళ్ల బియ్యంతో అన్నదానం చేపడతారు. నియమ నిష్టలతో ఈకార్యక్రమం అంగరంగ వైభవంగా చేపడుతున్నారు. ఈ సప్తాహ నిర్వహించడంతోనే తమ గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండటంతోపాటు సుఖః సంతోషాలతో ఉంటున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

- నారాయణ, మహారాజ్ యాతల్‌కర్



ఆధ్యాత్మిక చింతనతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. భక్తిమార్గంలో ప్రేమ, దయ గుణం పెంపొందుతాయి. వీటితోపాటు చెడు వ్యసనాలు దూరమై ఆరోగ్యంతోపాటు మనిషి సన్మార్గం వైపు వెళ్లడానికి ఆస్కారం ఉంటుంది.

మా గ్రామ ఐక్యతకు నిదర్శనం ఈ సప్తాహ

- గట్టుపెల్లి వెంకటి, చించాల



మేమంతా కలిసి 25ఏళ్లుగా అఖండ హరినామ సప్తాహ నిర్వహించడం మా ఐక్యతకు నిదర్శనం. ప్రతీ ఏడాది గ్రామస్థులంతా ఈ కార్యక్రమాన్ని భక్తి భావంతో అంగరంగ వైభవంగా చేపడతాం. ప్రతీ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ కార్యక్రమంతో పాడి పంటలు సమృద్ధిగా పండుతాయి. భక్తిమార్గంలో ఐక్యంగా ముందుకెళ్తున్నాం.

సమిష్టిగా నిర్వహిస్తున్న భక్తి కార్యక్రమం

- బైరోళ్ల సాయినాథ్, చించాల



గ్రామస్థులు అంతా సమిష్టిగా ఉండి అంగరంగ వైభవంగా ఈ భక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నాం. నియమ నిష్టలతో ఉంటూ సప్తాహ చేయడంతో మా గ్రామంలోని ప్రజలంతా సంతోషంగా ఉంటున్నాం.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

- ఒరగంటి లక్ష్మీకాంత్, చించాల



మా గ్రామంలో 25 ఏళ్ల నుంచి హనుమాన్ ఆలయంలో ఈ అఖండ హరినామ సప్తాహను గ్రామస్థులు అంతా కలిసి కట్టుగా ఉండి నిర్వహిస్తున్నాం. అప్పటినుంచి మా గ్రామంలో పంటలు బాగా పడుతున్నాయి. అంతా సంతోషంగా ఉంటున్నాం.

కుంభమేళా.. మహాద్భుత యాత్ర!

- నిర్మల్ జిల్లా నుంచి భారీగా తరలివెళ్తున్న భక్తులు

భైంసా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్కడి వెళ్లినా, ఏ చోట ఉన్నా.. ఏ నోట విన్నా ఉత్తర్‌ప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా గురించే. అక్కడికి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించాలని పరితపిస్తున్నారు. వచ్చేనెల 26 వరకు ప్రయాగరాజ్‌లో ఈ కుంభమేళా జరుగుతుండగా.. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే ఇందులో పాల్గొనేందుకు ప్రజలందరూ ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరిస్తే సర్వదోషాలు పోతాయని భావించి భక్తులు ఎంతో విశ్వాసంతో వెళుతున్నారు. చంద్రమండలం నుంచి భూమివైపు చూస్తే కనబడే ఏకైక ప్రజాసముహం కుంభమేళాగా చెప్పుకొంటారు.



భైంసా నుంచి కుంభమేళాకు తరలిన భక్తుల బృందం

- సమూహాలుగా వెళ్తూ..

జిల్లా నుంచి రోజు వందల సంఖ్యలోని వాహనాల్లో భక్తులు కుంభమేళాకు తరలుతున్నారు. మూడు, నాలుగు కుటుంబాలు కలిసి ప్రైవేట్ బస్సులు, వాహనాలను సమకూర్చుకొని కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు గాను తరలుతున్నారు. మరికొంత మంది మిత్రబృందాల ద్వారా అక్కడి వెళ్లి వస్తున్నారు. కొని ఏజెన్సీలు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి భక్తులను తీసుకెళ్తున్నాయి. రైళ్ళ ద్వారా వెళ్లే భక్తుల సంఖ్య అధికంగా ఉంటోంది.ప్రస్తుతం అక్కడ భక్తుల సంఖ్యలో అధిక మొత్తంలో ఉండటంతో ప్రయాగ్‌రాజ్‌కు 70 నుంచి 80 కిలోమీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేస్తున్నారు. ఈ క్రమంలో వాహనాలు నిలిపివేస్తున్న స్థలి నుంచి భక్తులు కాలినడక అక్కడికి చేరుకొని పుణ్యస్నానాలు అచరించి తిరిగి వస్తున్నారు.

జీవితంలో మర్చిపోలేని అనుభూతి

- శైలజ సందీప్ కులకర్ణి, భైంసా



కుంభమేళాలో పాల్గొనడం జీవితంలో మర్చిపోలేని అనుభూతినిచ్చింది. కోట్లాదిమంది వస్తున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు ఉండటం అద్భుతం. పడవలో ప్రయాణించాం. త్రివేణి సంగమం వరకు వెళ్లి స్నానం చేశాం. ఉదయం 5 గంటలలోపు వస్తే కుంభమేళ ప్రాంతం వద్దకు రావచ్చు. ఎంతమందైనా స్నానా లు చేసేందుకు ఘాట్లు ఏర్పాటు చేశారు. కుటుంబీకులతో కలిసి వెళ్లాం. యాత్ర సజావుగా సాగింది.

మరిచిపోలేని యాత్ర

- కదం సూర్యనారాయణరావ్ పాటిల్, భైంసా



కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు మిత్ర బృందంతో కలిసి వెళ్లా. అక్కడ వేలాది మంది నాగ సాధువులు, కిన్నెర సాధువులు, పండితుల దర్శనం చేసుకున్నాం. పవిత్ర గంగానది స్నానాలు ఆచరించాం. ఎక్కడా ఇబ్బంది లేదు. కోట్లాది మంది భక్తులకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయడం ఒకింత ఆశ్చర్యం వేపింది. నా జీవితంలో ఇదో మరిచిపోలేని యాత్రగా మిగిలిపోతుంది.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న పీఆర్‌ఓ కేసర్‌సింగ్

జైనథ్, జనవరి30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రామాల్లోని వివిధ ప్రతీ వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని నేషనల్ హైవే పీఆర్‌ఓ కేసర్ సింగ్ అన్నారు. 2025 జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని పిప్పర్‌వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించి జీబ్రా క్రాసింగ్ గుర్తులను తెలుసుకొని ప్రయాణించాలని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు. కార్యక్రమంలో పిప్పర్‌వాడ హెచ్‌ఎం శశికళ, సెక్యూరిటీ సిబ్బంది రాజ్‌కుమార్, అనిల్, డ్రైవర్ నర్సింహ, ఏఈపీఎల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో నయా మోసం

ఇంద్రవెల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో కొత్తరకం మోసం మొదలైంది. నాగోబా జాతరకు వస్తున్న ఓ యువకుడు తన బైక్‌లో రూ200 పెట్రోల్ పోయించుకున్నాడు. కొద్దిదూరం వెళ్లినా పెట్రోల్ పోసుకున్నట్లు రీడింగ్ చూపించలేదు. మండలంలోని ముత్నూర్ గ్రామం 6కిలో మీటర్ల దూరం పోయినా పోయించుకున్న పెట్రోల్ రీడింగ్‌లో కన్పించలేదు. దీంతో ఆ వ్యక్తి తిరిగి పంపు వద్దకు వచ్చి యజమాని విషయాన్ని వివరించాడు. బంకు నిర్వాహకుడు స్పందించకపోవడంతో ఆ వ్యక్తి అధికారులకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. ఆ అధికారులు కూడా స్పందించకపోవడంతో ఆ యువకుడు ఆందోళన వ్యక్తం చేస్తూ తీసిన సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో పంపడంతో ఆ వీడియో తెగ వైరల్ అవుతోంది. నాగోబా జాతర వచ్చే ఆది వాసీలు, భక్తులు ఇంద్రవెల్లిలోని పెంట్రోల్ పంపులో పెట్రోల్ పోసుకోవద్దని హెచ్చరించారు. అధికారులు పెట్రోల్ పంపు నిర్వాహకులపై చర్యలు తీసుకొని వినియోగదారులకు జరిగే మోసాన్ని అరికట్టాలని కోరాడు.

ఎమ్మెల్యేని కలిసిన గ్రామస్థులు

సిరికొండ, జనవరి30(ఆంధ్రజ్యోతి): కుంటగూడ గ్రామస్థులు బుధవారం రాత్రి ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఒరగంటి పెంటన్న, ఎండీ ఎక్బాల్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కుంటగూడ మాజీ సర్పంచ్ మడావి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



రెండు రోజులుగా నీరందించని 'భగీరథ'



కుభీర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మారు మూల గ్రామాలతో పాటు ఇంటింటికి నీరందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. కాగా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా తరుచూ కుభీర్ మండల కేంద్రంతో పాటు పార్డి(కే), పల్సి, డొడర్న, సిర్పెల్లి, సిర్పెల్లి తాండాలో వారానికి రెండు మూడు రోజులు నీరందించడం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించక పోవడంతో చిన్నపాటి లీకేజీలు ఉన్న సంబంధిత క్రిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రెండు మూలు రోజులు నీరందడం లేదని పలువురు గ్రామస్తులు అంటున్నారు. తాజాగా మండలంలోని బాకోట్ - పాంగ్ర గ్రామాల మధ్య గ్రిడ్ పైప్ లైన్‌కు లీకేజీ ఏర్పడింది. అయితే రెండు గంటల వ్యవధిలో మరమ్మతులు చేసి నీరందించవచ్చు కానీ అధికారులు పట్టించుకోక పోవడం కారణంగా రెండు రోజులుగా భగీరథ నీరందక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నీరందిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా వీరాంజనేయ
శివసాయి సమాజ్ వార్షికోత్సవం

ఘనంగా యాగశాల ప్రవేశం



ఆలయంలో యాగశాల ప్రవేశ పూజలు

ఖానాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయ 28వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో యాగశాల ప్రవేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు అంకం రాజేందర్ దంపతులతో సహా పలువురు యాగశాల ప్రవేశంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహ వచనము, రక్షాబంధనం, పండిత సన్మానము, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం కట్కం శేఖరయ్య, బక్కశెట్టి కిషోర్, కరిపే శ్రీనివాస్, శెట్టి శ్యామ్మోహన్‌రావు, అశోక్‌రావు, ఘంటసాల గంగాధర్, రాజశేఖర్, శేఖర్ రావు, గంగాధర్, లక్ష్మీరాజం, తదితరులున్నారు.

జలవిహార్‌కు మోక్షమెప్పుడో!?



- శ్రీరాంసాగర్ - బాసర గోదావరి నదిలో కలగానే బోటు షికారు
- అటకెక్కిన నది తీర ప్రాంత అభివృద్ధి
- భక్తులకు అందని ఆహ్లాదం

నిర్మల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బాసర సరస్వతీదేవిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులను ఆకట్టుకునేందుకే కాకుండా వారికి ఆహ్లాదం పంచేందుకు నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు - నిర్మల్ జిల్లాలోని బాసర వరకు బోటు 'జలవిహార్' ప్రాజెక్టు ప్రతిపాదనల దశలోనే నిలిచిపోయింది. కరోనా కల్లోలం తగ్గాక రాష్ట్రంలోని వివిధ నదీ తీర ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నౌక విహారం ప్రాజెక్టును అమలు చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. ఇందులో భాగంగానే కొన్ని నది తీర ప్రాంతాల్లో బోటు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నప్పటికీ.. బాసర వద్ద మాత్రం ఇప్పటి వరకు ఈ బోటు విహార సౌకర్యాన్ని యాత్రికులకు కల్పించలేకపోతున్నారు. బాసర సరస్వతీ దేవిని దర్శించుకునేందుకు ప్రతీరోజూ మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ముఖ్యంగా ప్రతీ శుక్రవారంతో పాటు పండుగ పర్వదినాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతారు. ఇక్కడ భక్తులకు వసతి సౌకర్యం ఉండడంతో ఒక రోజు గడిపి మరుసటి రోజు అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారి దర్శనం అనంతరం వీరంతా గోదావరిలో బోట్ షికారు చేసే సౌకర్యం కల్పిస్తే ఇటు టూరిజంశాఖకు ఆదాయ పరంగా.. అలాగే భక్తులకు ఆహ్లాదకరంగా ఎంతో అనుకూలంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదన

బాసర నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ వరకు బోట్లు నడపాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం శంకుస్థాపన సందర్భంగా గతంలో పోచంపాడ్‌కు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఈ అంశాన్ని ప్రస్తావించారు. పథకం పూర్తయితే కాళేశ్వరం జలాలతో ఎస్సారెస్పీ నిండాక బాసర - ఎస్సారెస్పీ మధ్య పడవలో ప్రయాణించవచ్చని మాజీ సీఎం కేసీఆర్ అప్పట్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి, పర్యాటక శాఖ అధికారులు ఇక్కడ బోటు విహారంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 2019లో కసరత్తు ప్రారంభించి ట్రయల్‌రన్ కూడా ప్రయోగాత్మకంగా చేపట్టారు. త్వరలో సర్వీసులు ప్రారంభిస్తామని గతంలో పర్యాటక శాఖ పేర్కొని.. రెండున్నర సంవత్సరాలైంది. కానీ ఇప్పటివరకు ఆ దిశగా దృష్టి సారించకపోవడం పట్ల పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బాసర గోదావరి వద్ద పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు (ఫైల్)



భక్తులకు నిరాశే

బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మరింత ఆహ్లాదం, మధురానుభూతిని పొందేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు సాకారమైతే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు శ్రీరాంసాగర్‌కు చేరుకొని అక్కడి నుంచి బాసరకు.. ఆ తర్వాత బాసర నుంచి తిరిగి శ్రీరాంసాగర్‌కు పడవల ద్వారా ప్రయాణించే అవకాశం లభిస్తుంది. అలాగే ఎస్సారెస్పీని ఆనుకొని ఉన్న నిజామాబాద్ జిల్లాలోని బస్వాపూర్, నాగాపూర్ గ్రామాల దగ్గర బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేసి బాసర వరకు పడవలను నడపాలని గతంలో అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు అధికారులు ఆ దిశగా కార్యాచరణ మొదలు పెట్టలేదు.

సంయుక్త కార్యాచరణ ఏదీ !?

బాసర నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ వరకు బోట్లు నడిపే విషయమై రాష్ట్ర పర్యాటక శాఖ, దేవాదాయ శాఖలు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాల్సి ఉంది.



గత ప్రభుత్వ హయాంలో జలవిహార్ ప్రాజెక్టుపై పోచంపాడ్ వద్ద చర్చిస్తున్న అధికారులు(ఫైల్)

గోదావరిలో బోటు ప్రయాణాలను ఆరంభిస్తే ఎస్సారెస్పీ నుంచి బాసర వరకు.. ఆ తర్వాత బాసర నుంచి ఎస్సారెస్పీ వరకు రెండున్నర గంటల వ్యవధిలో గమ్యానికి చేరుకోవచ్చు. సుమారు 60 కిలోమీటర్ల మేర ఈ ప్రయాణం సాగనుంది. మధ్యలో బ్రహ్మేశ్వర్ ఆలయ సందర్శన, ఉమ్మెడ తదితర పర్యాటక ప్రాంతాల వద్ద బోట్లు నిలిపినా.. మూడు గంటల్లోనే బాసరకు చేరుకోవచ్చు. ఏడాదిలో వేసవి మినహా మిగతా ఎనిమిది నెలల పాటు పడవలను నడిపే అవకాశం ఉంది.




రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



ఘటన స్థలంలో ఎక్సెల్‌ను ఢీకొట్టిన కారు

సోన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ నుంచి దూదిగాం ఫంక్షన్‌కు తన టీవీఎస్ ఎక్సెల్‌పై సాయన్న(56), అతని భార్య మరిపెద్ద పోసాని (56) వెళ్తున్నారు. మార్గ మధ్య లో మాదాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు అతివేగంగా అజాగ్రత్తగా వెళ్తున్న కారు టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టడంతో టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న దంపతులిద్దరూ సాయన్న, పోసానిలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ వారిని పరీక్షించి సాయన్న మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని భార్య పోసానికి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలో మరణించింది. మృతుడి కొడుకు మరిపెద్ద సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఏఎస్సై ఫైమద్ హుస్సేన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖానాపూర్ తహసీల్దార్‌గా
సుజాతరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలను స్వీకరిస్తున్న సుజాతరెడ్డి

ఖానాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ తహసీల్దార్‌గా సుజాతరెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇన్నాళ్లు ఖానాపూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన మామిడి శివరాజ్ నిర్మల్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కడెం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాతరెడ్డిని ఖానాపూర్‌కు బదిలీ చేస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సుజాతరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీ మండల అధ్యక్షులుగా గాండ్ల చిన్నయ్య

లక్ష్మణచాంద, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షులుగా గాండ్ల చిన్నయ్య ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా నాయకత్వం గురువారం తెలిపింది. చిన్నయ్య గత దీర్ఘకాలంగా మహేశ్వర్‌రెడ్డి అనుచరులుగా కొనసాగుతున్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన చిన్నయ్యకు స్నేహితులు, గ్రామస్థులంతా శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు పటిష్టచర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణ, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులు, గ్రామస్థులతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కడ్తాల్ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకై అధికారులందరితో ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్డీవో అధ్యక్షతన సంబంధిత అధికారు లందరితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించిందన్నారు. సంబంధిత అధికారుల నుంచి వై జంక్షన్ సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరాలను తెలుసుకున్నారు. త్వరితగతిన గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్తుల నుంచి సమస్య పరిష్కారానికి సూచనలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, ఆర్టీవో దుర్గాప్రసాద్, సోన్ తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, కడ్తాల్ గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి



దిలావర్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో

దిలావర్‌పూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించడంతో పాటు పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రణాళిక బద్ధంగా చదివి రానున్న ఫైనల్ పరీక్షలకు సిద్ధం అవ్వాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే సబ్జెక్టులపై పట్టు దొరుకుతుందన్నారు. పరీక్షలు అంటే భయపడకుండా ప్రశాంతంగా చదవాలన్నారు. పదోతరగతి విద్యార్థుల ఎస్ఏ-1, స్లిప్ టెస్ట్‌ల ఫలితాలను పరిశీలించిన డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించిన డీఈవో ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు. పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు క్రమం తప్పకుండా అల్పాహారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలకు హాజరు కావాలన్నారు. సబ్జెక్టు పరంగా ఏవైనా అనుమానాలు ఉంటే అందుకు సంబంధించిన ఉపాధ్యాయుడిని కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

నిర్మల్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని పంచశీల్ బీఎడ్ కళాశాలలో రెండు రోజుల (ఈ నెల 31 నుండి వచ్చే నెల 1) శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రామారావు పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడికి కెరీర్ కౌన్సిలింగ్, గైడెన్స్‌పై శిక్షణ తెలిపారు.

విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తాం

జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నిర్మల్ రూరల్, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించనున్నట్లు స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో మాసోత్సవాల్లో భాగంగా బాలశక్తి కార్యక్రమాన్ని భాగ స్వామ్యం చేస్తూ, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థ ల్లో చదివే విద్యార్థులందరికీ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి అధికారుల సమన్వయంతో ఈ అవగాహన కార్యక్రమాలను ప్రారంభించ బోతున్నట్లు అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కేంద్ర టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా బుర్ర రమేష్‌గౌడ్



ఖానాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా కడెం మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన బుర్ర రమేష్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని గురువారం ఆదిలాబాద్ ఎంపీ నగేష్ తనకు అందజేసినట్లు రమేష్‌గౌడ్ ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. పార్టీ కోసం తాను చేసిన సేవలను గుర్తించి తనకు కేంద్ర టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఎంపీ నగేష్‌కు కృతజ్ఞతలు చెబుతున్నట్లు రమేష్‌గౌడ్ పేర్కొన్నారు.

జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మాజీ మంత్రి

కుంటాల, జనవరి, 30 : (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న అత్త నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి పరామర్శించారు. మాజీ సర్పంచ్ బుచ్చన్నను మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నాయకులు బెజ్జంకి ముత్యంరెడ్డి, గన్ను నర్సారెడ్డి, హన్మండ్లు, రాజేశ్వర్, ఫైమద్, పెంట ధశరథ్, ఆలూర్ ప్రశాంత్, విజయ్, ఆత్మస్వరూప్ తదితరులు ఉన్నారు.

చల్లంగా చూడు.. పోచమ్మ తల్లీ



వేకువ జామున చించాలలో పోచమ్మ ఆలయం వద్ద బోనాలతో..

ముథోల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఏటా పుష్య అమావాస్య నుంచి గ్రామదేవత పోచమ్మకు సమర్పించే చలిబోనాల వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని చించాల, ఎడ్‌బిడ్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో అధికసంఖ్యలో మహిళలు చలి బోనాలతో పోచమ్మ ఆలయాలకు పోటెత్తారు. చలిబోనం గ్రామదేవతలకు సమర్పించి చల్లగా మమ్ము చూడమ్మా అంటూ భక్తి శ్రద్ధలతో పోచమ్మ, గ్రామ దేవతల ఆలయాల్లో పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య సందర్భంగా రాత్రి బోనాలు వండి తెల్లవారు జామేన ఈ చలి బోనాలను గ్రామ దేవతలకు సమర్పించి, మొక్కులు తీర్చుకోవడంతో గ్రామంలోని కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో పాటు పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయని భక్తుల నమ్మకం.

నేడు ఇటిక్యాల్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

పెంబి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో శుక్రవారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. నేటి నుండి మూడు రోజుల పాటు గుడిగోపురం, గజస్తంభ, నవగ్రహాల, గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. వివిధ కార్యక్రమాలు వేద పండితులచే ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరగనున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వీడీసీ సభ్యులు మహేందర్, ఎల్లయ్య, శివలింగ, రాములు, రాజన్న, అయిండ్ల శంకర్, వినాయక్, షబ్బీర్, తదితరులు ఉన్నారు.

నేడు 'రాంజీ గోండు' కవుల సమ్మేళనం

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటికీ చరిత్ర పుటలకు ఎక్కని రాంజీ గోండు సహా వెయ్యి మంది అమరవీరుల(వెయ్యి ఉరుల మర్రి) చరితను విశ్వవ్యాప్తం చేయాలన్న ఉద్దేశంతో శుక్రవారం 'కవుల సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు రాంజీ గోండు స్మారక సమితి నిర్వాహకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. రాంజీ గోండు సహా వెయ్యి మంది అమరుల ప్రాణ త్యాగాలు, నాటి చరిత్రపై కవులు, రచయితలు, ఔత్సాహిక చరిత్రకారులు తమ రచనలను ఈ కార్యక్రమంలో వెల్లడించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి గలవారు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.